
# ఈ వారం కథ

— రాప్తాడు గోపాలకృష్ణ

●● మగవాళ్ళు చీకట్లో ఆడవాళ్ళ కాళ్ళు పట్టుకోవడానికీ, వాత్స్యాయన భంగిమల్లో చుంబనలు చేయడానికి చారిత్రక ఆధారాలూ, శాస్త్ర ఆధారాలు వున్నాయి కానీ, ఏ ఆధారాలూ లేకుండా ఆయనైనా ఇంట్లో కసువెలా వూడుస్తారు?

## కుబుసం



ఉదయాన్నే చీపురు ముట్టుకుంటే చాలు—హృదయమంతా కంపించి, శరీరం గగుర్పొడుస్తుంది.

ఇల్లంతా శుభ్రంగా వూడ్చి మూల కూర్చుండే నిర్జీవపు చీపురు ఇద్దరి మనుషుల మధ్య అజ్ఞాతంగా వుండే వైరుధ్యాలను వెలికి తీసింది.

నన్ను భ్రమల్లో ముంచిన నగిషీలు పొదిగిన వ్యక్తిత్వపు అసలు రూపాన్ని బహిర్గతం చేసింది.

ఇంటినీ, లోగిలినీ వూడ్చి కసువునంతా కుప్పగా చేయటమేగాడు, నా భర్త పైన వున్న కుబుసాన్ని కూడా వూడ్చి 'మగబుద్ధి' తళతళల్ని చూపించి నా కళ్ళు తెరిపించింది.

రోజూలాగే ఆ రోజు కూడా తెల్లవారింది. ఆ రోజు స్కూల్లో జరిగే ఇన్స్పెక్షన్‌కి ప్రిపేర్ అవుతూ క్రితం రాత్రి పన్నెండు గంటలదాకా మేల్కొని వుండటంవల్లో, అర్ధరాత్రి దాటిన తరువాతపాల్గొన్న అసంకల్పిత శృంగారపు ఫలితంగా కలిగిన శరీరపు బడలికవల్లో రోజూలాగే తెల్లవారుఝామున నిద్ర లేవలేక పోయాను.

నా కలలు విచ్ఛిన్నమై భ్రమలు పూచాయి.

భ్రమల లోకంలో విస్ఫోటనం జరిగి వాస్తవాలు గుబాళించాయి.

పెళ్ళయిన రెండేళ్ళ నుండీ నేనే ఎప్పుడూ మా ఆయన్ని నిద్ర లేపేదాన్ని. ఆ రోజు మాత్రం మా ఆయనే నన్ను నిద్ర లేపాడు. ఎంతగా నిద్ర లేపాడంటే జీవితంలో మరెప్పుడూ ఆదమరచి నిద్రపోయే అవకాశం లేకుండా నిద్ర లేపాడు.

కళ్ళు తెరిచేపాటికి లేలేత సూర్య కిరణాలు కిటికీ రంధ్రాల్లోంచి ఇంట్లోకి జొరబడుతున్నాయి.

రోజూ నిద్ర లేస్తూనే కన్పించే చీకటి తెరలు కన్పించకపోయేసరికి తెప్పరిల్లాను. గుండె 'ఠంగ్... ఠంగ్'మని ఏడు గంటలు కొట్టింది. గబగబా లేచి కుచ్చిళ్ళు సవరించుకుని వంటింట్లోకి పరుగెత్తాను.

రాత్రివి ఎంగిలి గిన్నెలు తోమి, కాఫీ చేసి ఆయనకిచ్చాను. అన్నమూ, కూర చేసేపాటికి

13-3-92 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

పెళ్ళి చేసుకోకుండా ఉంటే సుఖమేమిటో చెప్పు అన్నాడు రామారావు.

మనం నిద్రలేవగానే ఎంచక్కా మంచం ఎటునుంచైనా దిగవచ్చు సంతోషంగా చెప్పాడు ఆనందరావు.

— గొల్లపూడి శైలజ

ఎనిమిదయ్యింది. నేనింకా పళ్ళయినా తోమలేదు. స్నానం చేయాలి. చంటిదానికి స్నానం చేయించి, సీసా పాలు సిద్ధం చేసి ఆయాకి అప్పగించాలి. జడ అల్లుకోవాలి. ఆయనకో క్యారియర్, నాకో క్యారియర్ కట్టాలి. ఇన్ని పనులూ ముగించుకుని ఎనిమిదిన్నరకు ఇల్లు వదలకపోతే, మా హెడ్ మిస్ట్రెస్ చెప్పినట్లు తొమ్మిది గంటలకు స్కూల్లో వుండలేను. అందులోనూ ఆ రోజు ఇన్స్పెక్షన్ ఏ విధంగా చేసుకోవాలో దిక్కు తోచటం లేదు. కాళ్ళూ, చేతులూ ఆడటం లేదు.

నాలో ఇంత గందరగోళం జరుగుతుంటే మా ఆయన తాపీగా సిగరెట్ కాలుస్తూ, న్యూస్ పేపర్ చదువుతూ రెండోసారి కాఫీ కావాలంటూ ఆర్డర్ జారీ చేశారు. ఫ్లాస్క్‌లో కాఫీ కప్పులోకి వంచి ఆయనకిస్తుంటే గుర్తొచ్చింది—ఇంకా కసువూడ్చ లేదని.

ఉరి బిగుసుకునేప్పుడు ఇలాగే వుంటుందేమో పరిస్థితి! ఎంత ఆత్రంగా చేసుకున్నా ఎనిమిదిన్నరకు బయలుదేరటం అసాధ్యం. ప్రైవేట్ స్కూల్లో పనిచేయటమే కష్టం. మామూలు రోజుల్లోనే తొమ్మిది గంటలకి హాజరు కాకపోతే అదోలా చూస్తుంది మా మేడం. ఆమె విసిరే చూపులు గుచ్చుకోవలసిన చోటే గుచ్చుకుంటాయి గురి తప్పకుండా. ఆ రోజు ఇన్స్పెక్షన్. ఛ...ఛ అన్నీ కష్టాలే. మా ఆయనకయినా మంచి ఉద్యోగం వుంటే ఇవన్నీ వుండకపోవునేమో!

అతలాకుతల మవుతున్న మనసుతో—"ఏమండీ! ఎన్ని పనులున్నాయో చూడండి. టైం చూస్తే ఎనిమిదయింది. చంటిదానికి స్నానం చేయించి నేనూ చేసొస్తాను. అంతలోపల మీరు ఆ పేపర్ కాస్తా పక్కన పడేసి, తలుపులేసుకుని కసువూడ్చండి" అన్నాను.

నేనెప్పుడూ ఎరుగని, వూహించని విధంగా ఆయన మొహంలో రంగులు మారాయి. నా మాటలు ఆయన చెవిని సోకనైనా సోకినాయో లేదో! ఆయన చేతి వేళ్ళు అయిదూ నా చెంపను అంటుకున్నాయి.

హస్తం గుర్తు ఒక స్త్రీని ధీమాగా పార్లమెంటుకు నడిపించి వుండవచ్చు. కానీ నా చెంప మీది హస్తం గుర్తు నన్ను స్కూలుకి నడిపించలేక పోయింది. వారం రోజులు బయటి ప్రపంచానికి నా మొహం చూపించలేక పోయాను. ఉద్యోగం వూడిపోయింది.

కొన్నాళ్ళ తరువాత వుద్యోగ ప్రయత్నం చేయమన్నాడాయన. నేను చేయలేదు. పని గంటల పరిధిగానీ, సెలవులుగానీ, పర్మిషన్‌లుగానీ, జీతంగానీ, లోన్‌లుగానీ, బోనస్‌లుగానీ లేని వుద్యోగం ఒక సంవత్సరం ఎనిమిది నెలల క్రితం లక్ష రూపాయిలు ఖర్చుచేసి తెచ్చుకున్నాను. ఉన్న ఉద్యోగం వూడిపోకుండా వుంటే చాలు. మరో వుద్యోగం దేనికి!

* * *

మా ఆయన ఎంతగా మారిపోయినాడంటే—కుదురుగా ఒక చోట కూర్చుని, యాష్ ట్రే పట్టుకొని సిగరెట్ తాగటం మానేసి ఇల్లంతా బూడిద చల్లుతూ మూలలన్నీ సిగరెట్ పీకల మయం చేస్తాడిపుడు. ఏ పని చేసినా అస్తవ్యస్తంగానూ, అడ్డదిడ్డంగానూ చేస్తాడిపుడు. స్నానం చేసినపుడు డ్రాయరు వుతికి ఆరేయటం కూడా మానేశారు. అన్ని పనులూ సక్రమంగా చేస్తే మెల మెల్లగా ఆయనతో కసువూడ్పించటం, అంట్లు తోమించటం కూడా చేయిస్తాననుకున్నారో ఏమో! ఆయన జాగ్రత్తలో ఆయన వుంటున్నారు.

కొన్ని వేల సంవత్సరాల నుండీ స్త్రీలు కసువూడుస్తున్నారు. దాన్నో అవమానకరమైన పనిగా ఎప్పుడూ భావించలేదు. కానీ, ఒకే ఒక రోజు, ఒక్క పూట అదీ తలుపులేసుకొని కసువూడ్చటం ఎందుకంత అవమానకరమైనదిగా అనుకున్నాడో మా ఆయన—ఎంత ఆలోచించినా అంతుబట్ట లేదు.

మగాళ్ళు కసువూడ్చరని నాకు తెలుసు. కానీ మా ఆయన అందరిలాంటి మగవాడు కాదనుకున్నాను. నా కోసం ఏమైనా చేస్తాడనే దృఢ నమ్మకం నాకు లేకపోతే నేనాయనకు ఆ పని చెప్పను. ఏడాదిన్నర దాటిన వైవాహిక జీవితంలో ఏ ఇంటి పనిలోనూ ఆయన సహాయం కోరలేదు.

ఆయన చేయలేదు. కానీ, నేనడిగితే తప్పకుండా చేస్తారనే ఓ గట్టి (గుడ్డి) నమ్మకం వుండేది.

ఏ ఆందోళనా, కలకలమూ లేనట్లు మా ఆయన నిమ్మళంగా వుండగలుగుతున్నారు. నేనుండలేక పోతున్నాను. 'ఆయనా—నేనూ' అని రెండుగా చీల్చి మాట్లాడాలంటేనే చేతకావటం లేదు. మా ఇద్దరినీ నేనెప్పుడూ 'ఇద్దరు' అనుకోలేదు. 'ఒకటే' అనుకున్నాను. భూమ్యాకాశాల కలయిక అనుకున్నాను. 'ఫీనిక్స్ రిడిల్' అనుకున్నాను.

నా ఆలోచనలూ, అంచనాలూ, నమ్మకాలూ అన్నీ భ్రమలు కావటం భరించలేక పోతున్నాను. అనంతమైన ఆలోచనలలో 'ప్రేమకు' నిర్వచనం ఖండితంగా తెలియటం లేదు. ఎడతెగని ఆలోచనలూ.. .జ్ఞాపకాలూ...

కొత్త దంపతులమైన మేము మా వూరికి దగ్గరగా వున్న మహాబలిపురానికి హనీమూన్‌లా వెళ్ళాము. ఒక కాటేజి అద్దెకు తీసుకున్నాం. పది రోజులు ఈ ప్రపంచాన్ని మరిచిపోయాం. నాకు ఆయనా, ఆయనకి నేనూ తప్ప మరేమీ కన్పించలేదు. మనుషులెవ్వరూ లేనిచోట ఇసుకలో, వెన్నెల్లో, బండరాళ్ళ దగ్గర సముద్రపు కెరటాలతో ఆడుకుంటూ, ఇసుక గుజ్జలేరుకుంటూ, నీళ్ళలో తడుస్తూ, ఒకరికొకరు వుద్రేకమౌతూ, కౌగిలించుకుంటూ...చలం 'మైదానం'లోని అమీరూ, అతని ప్రియురాల్లాగ గడిపాం. అంతకంటే మించిపోయాం.

చలం సిగ్గుపడి రాయలేకపోయాడేమో! మా శృంగార చేష్టలు వాళ్ళకంటే ఎక్కువగా వున్నాయి.

ఒకరోజు నేను ఇసుకలో కాళ్ళు చాపుకుని కూర్చున్నాను. ఆయన ఇసుకలో పడుకుని అటూ ఇటూ దొర్లుతూ వచ్చి నా పాదాలను ముద్దు పెట్టుకున్నాడు.

"ఛీ, ఏంటండీ మగాళ్ళు ఎక్కడయినా ఆడాళ్ళ పాదాలు తాకవచ్చా?" అన్నాను.

"ఎందుకు తాకకూడదూ" అని శ్రీకృష్ణుడు-సత్యభామ చేత కాలిదెబ్బలు తిన్న ఘట్టాన్ని గుర్తు చేశాడు.

మరొకరోజు గదిలో చీకట్లో నన్ను నగ్నంగా చేసి నా వొళ్ళంతా ముద్దులు కురిపిస్తూ చెప్ప లేని చోట కూడా చుంబించాడు.

"ఛీ! ఛీ! ఏమిటీ అసహ్యం?" అని వారించాను గట్టిగా.

వాత్స్యాయన కామసూత్రాలను విపులంగా చెప్పి ఉదయాన్నే మహాబలిపురం గుడులన్నీ వెదకి ఒక స్తంభం మీద చెక్కిన వివిధ శృంగార భంగిమల్ని చూపించాడు. ఆ తరువాత నా సందేహాల కన్నింటికీ 'సమరం' పుస్తకాలలో సమాధానాల్ని చూపించాడు. అప్పటికీ నేను అంగీకరించలేదు కానీ ఆయన్తో వాదించలేదు. ఆ విధంగా నాకు తెలియని నా శరీర ధర్మాల్ని బోధించిన గురువాయన.

"నేను నీ కోసం, నీవు నా కోసం" అని డైలాగు చెప్పిన మొగుడాయన. శారీరక సంబంధాలకీ, సాంసారిక సంబంధాలకీ వేరు వేరు ధర్మాలు వుంటాయని నిరూపించిన 'మగవాడు' ఆయన.

అవునులే! మగాళ్ళు చీకట్లో ఆడవాళ్ళ కాళ్ళు పట్టుకోటానికీ, వాత్స్యాయన భంగిమల్లో చుంబనలు చేయటానికీ చారిత్రక ఆధారాలూ, శాస్త్ర ఆధారాలూ వున్నాయికానీ, ఏ ఆధారాలూ లేకుండా ఆయనయినా ఇంట్లో కసువెలా వూడుస్తారు?